# బినామీ

కొండయ్యకి పొద్దున్న లేచినప్పణ్నుంచీ లేచినట్లు లేదు-

రాత్రే చచ్చిపోయాడు- చచ్చిపోయినట్లు... ఖచ్చితంగా తను చచ్చిపోయినట్లు కల వచ్చింది-

"కొండయ్యా, ఒరే కొండిగా, పంచెయ్‌రా... పంచెయ్... నీ ఆస్తంతా తుంచేయ్..." వికృతమైన ఓ గొంతు వినిపించింది.

"ఎవరిదా గొంతు?" బిగ్గరగా అరిచాడు... కొండయ్య-

"నేన్రా... నీ మృత్యువుని... నీ ఆస్తి అంతా భాగాలు పెట్టేయ్..."

కొన్ని కుక్కలూ కొన్ని నక్కలూ కొన్ని పులులూ మొరుగుతూ... వికృతంగా అరుస్తూ గాండ్రిస్తూ తిట్టిపోసాయతన్ని- అవన్నీ మనుషుల వేషాలు వేసుకుని వచ్చాయి. వరసలు కూడా కలిపేయవి- బావా అనీ... నాన్నా అనీ... మావా అనీ బంధుత్వాల్తో మీద మీద కొచ్చాయా జంతువులన్నీ-

"నోరు ముయ్యండి... నా ఆస్తి నా స్వార్జితం... ఇష్టం వొచ్చిన

వాళ్లకిస్తాను. నాలా మీరు కూడా సొంతంగా సంపాదించుకుని మీ ఇష్టం వొచ్చినట్లు చేసుకోండి- పోండి! చావండి" అన్నాడు.

"చావం... చంపుతాం" అని అందరూ ఒక్కసారి మీద పడిపోయారు. చావ చితక్కొట్టేశారు... చంపేశారు.

తను రక్తం మడుగులో నిర్జీవంగా పడి ఉన్నాడు- బంధువులు అంతా వికృతంగా నవ్వుతున్నారు.

ఒక్కటే గొంతు గుండెలవిసేలా ఏడుస్తోంది- ఎవరిదా గొంతు? తన భార్యదా? కాదు!! ముసలి తల్లిదా? కాదు!! ఆ గొంతు తనదే!!! తన శవం మీద పడి తనే ఏడుస్తున్నాడు.

గబుక్కున నిద్రలోంచి లేచాడు- భయంతో ముచ్చెమట్లు పోసాయి. నాలిక మాత్రం పొడారిపోయింది!!

భార్యని పిలిచి మంచినీళ్లు అడుగుదామనుకున్నాడు. అది ఇవ్వదు. నన్ను చంపేసిన వాళ్లలో తనూ ఉంది. నవ్వుతూన్న వాళ్లలోనూ అది ఉంది. అందరూ శత్రువులే. మంచినీళ్లిచ్చినా విషం కలిపే ఇస్తారు.

\+ + +

కొండయ్యకి ఎందుకంత భయం??

పాపం చేసిన వాడికీ... తప్పు చేస్తున్న వాళ్లకీ భయం ఉంటుంది-

కరెక్టే... కొండయ్య పాపమూ తప్పే కాదు... ద్రోహం కూడా చేశాడు. చేశాడు గనకే... సీమసింతకాయలు అమ్ముకునే స్థాయినుంచి... ఇవ్వాళ లక్షాధికారయ్యాడు... నాలుగెకరాల ఆసామి అయ్యాడు- రోజంతా కష్టపడి ఊరంతా తిరిగి సీమచింతకాయలు అమ్మితే... 15 రూపాయలు ఆదాయం ఉండేది... సుబ్బరాజుగారు మంచాడు కాబట్టి తన మెట్ట

మీదున్న సీమ చింతచెట్లు కాయల్ని ఫ్రీగా కోసుకోమని పర్మిషనిచ్చాడు. మొదట్రోజు బుట్టకి 2 రూపాయలు ఇస్తానని కొండయ్య బేరం పెట్టాడు. సుబ్బరాజుగారు నవ్వేసి... పోరా నీ మొహం... నువ్వేం డబ్బులివ్వక్కర్లేదు అన్నారు. ఆ తర్వాత సీజనంతా తను కాయలు కోసుకుని అమ్ముకునేవాడు- ఇంకోడెవడూ తన చెట్లకి వాటా రాకుండా సుబ్బరాజుగారు బుట్టకి ఐదు రూపాయలు తీసుకుంటున్నాడని తిట్టుకుంటూ చెప్పేవాడు-

సుబ్బరాజుగారు 200 ఎకరాల భూస్వామి- తన పొలం వారా ఎందుకు మొల్చాయో కట్టవేసినట్లు ఏడెనిమిది సీమ చింతచెట్లు మొలిచాయి. పోనీలే... పచ్చటి చెట్టుని కొట్టటం దేనికని... అలా ఉంచేశాడు. వాటికోసం చిలుకలు ఏవేవో పక్షులూ వచ్చి సందడి చేస్తుంటే చూడ ముచ్చటగా వుండేది.

కొండయ్య పిల్లలు గలవాడు- సీజన్లో నాలుగు డబ్బులు సంపాదించుకుంటే తనకేంటి నష్టం అని 'డబ్బొద్దులే పట్టుకెళ్ల'న్నాడు. వాడి కళ్లలో ఎంత కృతజ్ఞతో! ఈ సీజనయ్యాక ఏదైనా పనిచ్చి సాయపడాలి అనుకునేవాడు సుబ్బరాజుగారు.

గవర్నమెంట్ లేండ్ సీలింగ్ పెట్టిన రోజులవి. సుబ్బరాజుగారికి కూడా పిత్రార్జితం స్వార్జితం కలిపి చాలా పొలమే ఉంది- సీలింగ్‌లో కొంత లేండ్ వదులుకోవాలి.

దగ్గర బంధువులకి కొన్ని ఎకరాలు వాటా పెట్టాడు. కొంత ఇళ్ల స్థలాలుగా కొంతమంది పేదలకిస్తే పుణ్యాం పురుషార్థం కలిసొస్తుందని ఆలోచించాడు-

ఆ ఆలోచన రాగానే కొండయ్య మొదటి వ్యక్తిగా గుర్తొచ్చాడు. అతనికేవన్నా సాయపడాలని ఎప్పణ్నుంచో అనుకుంటున్న సుబ్బరాజు

గారికి, ఇలా పేదరికంలో ఉన్న ఓ పది మందికి ఇంటి స్థలాలు ఇవ్వవచ్చుని అనుకున్నాడు. కొండయ్యకి విషయం చెప్పి నిజంగా అవసరం ఉన్న ఓ పదిమందిని ఎంపిక చెయ్యమన్నాడు.

కొండయ్యలో స్వార్థం కొండ చిలువలా పెరిగింది.

"అయ్యగారూ... మీ మంచితనం అదరండీ... కానీ ఈ స్థలాన్ని పది ముక్కలు చేసి పది మందికి పంచిస్తే వాళ్లు దాన్ని ఉంచుకోరూ... వినియోగించుకోరు! అమ్మేసుకుంటారు- ఎవరికీ ఇవ్వద్దు. బంగారం లాంటి ఈ నాలుగెకరాల్ని ఇళ్లు కట్టించి రాళ్లపాలు చేయకండి... పంటనిచ్చే తల్లిని పంచి ఇవ్వకండి..." అంటూ... చాలా సెంటిమెంట్ టచ్చితో సుబ్బరాజుగారి మెప్పుని పొందాడు కొండయ్య.

"మీ పొలం మీకే ఉండాలి. అంతగా కావాలంటే బినామీ పేరున రాసెయ్యండి. ఇది తప్పుకాదు. గవర్నమెంట్ ఎన్ని ఎత్తులేసినా పై ఎత్తు అనేది ఉంటూనే ఉంటుంది" అంటూ పెద్ద ఆరిందలా సలహా ఇచ్చాడు.

సుబ్బరాజుగారు కొండయ్య బినామీతో 4 ఎకరాల పొలం రిజిష్టర్ చేశాడు.

కొండ చిలువ కుట్ర ఫలించింది. 4 ఎకరాలకి కంచె కట్టాడు. చూస్తుండగా అక్కడో పెంకుటిల్లు కట్టాడు-

ఆ నాలుగెకరాల కొబ్బరికాయలూ తనే దింపించి ఎగుమతి చేయించేవాడు- పంటమ్మిన సొమ్మును స్వార్జితంగా భావిస్తున్నాడు.

"కొండయ్యా... పదిమందికి ఇళ్లస్థలం ఇచ్చినా నాకు పుణ్యం వచ్చేదయ్యా- నువ్వు నన్ను మోసం చేశావు. ఇంతకింతా అనుభవిస్తావు"

అని ఎదురుపడినప్పుడల్లా కొండయ్యని శపించేవాడు సుబ్బరాజుగారు-

కొన్నాళ్లుపోయాక ఎదురుపడ్డం మానేశాడు.

ఇంకొన్నాళ్లకి ఎదిరించటం మొదలెట్టాడు.

సుబ్బరాజుగారి శాపం నిజమైనట్టు ఇద్దరు కొడుకులూ, బావమరిదీ- ఆ బావమరిదిని పెళ్లాడిన కూతురూ వాటాలిచ పంచెయ్యమనీ పేచీ మొదలెట్టారు. భార్య కూడా వాళ్ల పక్షమే. 'మనం డబ్బులో పుట్టామా? డబ్బులో పెరిగామా... వాళ్లకి ఆస్తి పంచివ్వటం నీ బాధ్యత' అని కొండయ్యకి నీతులు చెప్పేది.

విని విని విసిగెత్తిపోతున్నాడు కొండయ్య. కుట్ర చేసి కూడబెట్టిన ఆస్తి ఈ నక్కలకీ, కుక్కలకీ ఇవ్వాలని రూలేం లేదు... అని కొండయ్యకి కొండంత నమ్మకం... దాని గురించి ఇంట్లో ఎవరికీ సుఖం శాంతి లేకుండా అయిపోయింది. సీమసింతకాయల వ్యాపారంలో వున్నప్పుడే హాయిగా ఉండేది... కుక్కిన పేనుల్లా ఉండేవాళ్లు... ఇప్పుడు నాలుగు వేళ్లూ నోట్లోకెళ్లేప్పటికి ఆశలు పెరిగిపోయాయి వెధవలకి అన్నాడు... అందరూ విరుచుకుపడిపోయారు. బావమరిది తాగేసి చెయ్యెత్తాడు కూడా. వాణ్ని కోపంగా అరిస్తే బీపీ పెరిగి కళ్లు తిరిగి పడిపోయాడు.

మంచం మీదకి ఎవరు ఈడ్చారో తెలియదు. రాత్రంతా పీడ కలలు... పీడించేవాళ్లు కలలోకొచ్చారు. తెల్లారాక... ఓపిక తెచ్చుకుని సుబ్బరాజు గారింటికి వెళ్లాడు... బినామీ పేరు తనకొద్దని కాళ్లట్టుకుని ఏడిచేశాడు... పదిమందికి ఇళ్లపట్టాలు ఇచ్చేయమని... తన ఇంటి జాగా తనకే ఉండనివ్వమని... ప్రాధేయపడ్డాడు. మనఃశ్శాంతిగా ఇంటివైపు వెళ్లాడు- ఇప్పుడు వాళ్లు తనని చంపేసినా పర్లేదనుకున్నాడు కొండయ్య.

